
కీర్తనలు

# రామదాసు కీర్తనలు



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని ఇంటర్నెట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. సేకరణ కర్త పేరు మాకు తెలియరాలేదు, అయినా వారు మంచి సేవ చేసారు కావున ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. దీనిద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
2) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
3) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో ఇంటర్నెట్ నుంచి సేకరించి ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Helpline/WhatsApp: 9042020123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

# శ్రీ రామదాసు కీర్తనలు

1. వరాళిరాగం ఆదితాళం

పల్లవి : అంతా రామమయం యీ జగమంతా రామమయం

అంతరంగమున నాత్మారాముం డనంత రూపమున వింతలు సలుపగ

॥అంతా॥

సోమసూర్యులను సురలుదారలను

ఆ మహాంబుధులు నఖిల జగంబులు

అండాండంబులు పిండాండంబులు

బ్రహ్మాండంబులు బ్రహ్మలు మొదలు ॥అంతా॥

నదులు వనంబులు నానామృగములు

విదితకర్మములు వేదశాస్త్రములు ॥అంతా॥

అష్టదిక్కులును నాదిశేషుడును

అష్టవసువులు నరిషడ్వర్గములు ॥అంతా॥

ధీరుడు భద్రాచల రామదాసుని

కోరిక లొసగెడి తారకనామము ॥అంతా॥

2. అసావేరి ఆదితాళం

పల్లవి : అబ్బ బ్బ దెబ్బలకు తాళలేనురా

రామప్ప గొబ్బున నన్నేలు కోరా ॥అబ్బబ్బ॥

మేలు చేయుదునంటి గదరా

వరహాలు మొహరీలు జమచేస్తిగదరా

నీ పరిచారులకు నే పెట్టితి గదరా ॥అబ్బబ్బ॥

పరులకొక్కరువ్వ యీయలేదు గదరా

ఓ పరమాత్మ నీ పాదముల్ నమ్మితిరా

కొరడాలు తీసుక గొట్టిరిగదరా

హరసుత గోవిందం హరితాళలేనురా ॥అబ్బబ్బ॥

అంతటిలో నిను నెరనమ్మినానురా

శరణాగత గోవిందలహరి తాళలేనురా

శరధి బంధించిన శౌర్యమెక్కడరా

రాక్షస సంహార రక్షింపరారా ॥అబ్బబ్బ॥

రామ భద్రాద్రిరామ సీతారామా

నీ నామమెప్పుడు భజయించితి గదురా

రామదాసుని నిటుల చేయించి తేరా ॥అబ్బబ్బ॥

3. వరాళి ఏకతాళం

పల్లవి : ఇదిగో భద్రాద్రి గౌతమి అదిగో చూడండి

ముదముతో సీతాముదిత లక్ష్మణులు

కలసి కొలువగా రఘుపతి యుండెడి

చరణములు

చారుస్వర్ణ ప్రాకార గోపుర

ద్వారములతో సుందరమై యుండెడి ॥ఇదిగో॥

అనుపమానమై అతిసుందరమై

దనరుచక్రము ధగధగ మెరిసెడి ॥ఇదిగో॥

కలియుగమందున నిలవైకుంఠము

నలరుచున్నది నయముగ మ్రొక్కుడి ॥ఇదిగో॥

పొన్నల పొగడల పూపొదరిండ్లను

చెన్ను మీగడను శృంగారంబడు ॥ఇదిగో॥

శ్రీకరముగ రామదాసును

ప్రాకటముగ బ్రోచె ప్రభువాసము ॥ఇదిగో॥

4. కాంభోజి ఆదితాళం

పల్లవి : ఇక్ష్వాకుల తిలక ఇకనైన బలుకవు రామచంద్ర

నన్ను రక్షింపకున్నను రక్షకులెవరింక రామచంద్రా ॥ఇక్ష్వాకు॥

చుట్టూ ప్రాకారములు సొంపుతోగట్టిస్తి రామచంద్ర

యాప్రాకారములకు బట్టె పదివేల వరహాలు రామచంద్ర ॥ఇక్ష్వాకు॥

గోపుర మంటపాలు కుదురుగ గట్టిస్తి రామచంద్ర

నను క్రొత్తగ జూడక యిత్తరి బ్రోవుము రామచంద్ర ॥ఇక్ష్వాకు॥

భరతునకు చేయిస్తి పచ్చల పతకము రామచంద్ర

యాపతకమునకు బట్టె పదివేల వరహాలు రామచంద్ర ॥ఇక్ష్వాకు॥

శత్రుఘ్నునకు చేయిస్తి బంగారు మొలత్రాడు రామచంద్ర

ఆ మొలత్రాటికిబట్టె మొహరీలు పదివేలు రామచంద్ర ॥ఇక్ష్వాకు॥

లక్ష్మణునకు చేయిస్తి ముత్యాల పతకము రామచంద్ర

యా పతకముకు బట్టె పదివేల వరహాలు రామచంద్ర ॥ఇక్ష్వాకు॥

సీతమ్మకు చేయిస్తి చింతాకు పతకము రామచంద్ర

యా పతకమునకు బట్టె పదివేల వరహాలు రామచంద్ర ॥ఇక్ష్వాకు॥

వాహనములు మీకు వరుసతో జేయిస్తి రామచంద్ర

జగన్మోహన సంకెళ్లు వేసిరి కాళ్లకు రామచంద్ర ॥ఇక్ష్వాకు॥

కలికి తురాయి నీకు మెరుపుగ జేయిస్తే రామచంద్ర

నీవు కులుకుచు దిరిగెదవు ఎవరబ్బ సొమ్మని రామచంద్ర॥ఇక్ష్వాకు॥

మీ తండ్రి దశరథమహారాజు పెట్టెనా రామచంద్ర

లేక మీ మామ జనక మహారాజు పంపెనా రామచంద్ర ॥ఇక్ష్వాకు॥

అబ్బ తిట్టితినని ఆయాసపడవద్దు రామచంద్ర

యీ దెబ్బలకోర్వక అబ్బ తిట్టితినయ్య రామచంద్ర ॥ఇక్ష్వాకు॥

ఏటికి చల్లిన నీళ్లాయె నా బ్రతుకు రామచంద్ర

నేను అథమురాలికంటె నన్యాయమైతిని రామచంద్ర ॥ఇక్ష్వాకు॥

సర్కారు పైకము తృణముగ నెంచక రామచంద్ర

దెబ్బలు తినలేను యప్పుదీర్చుమయ్య రామచంద్ర ॥ఇక్ష్వాకు॥

కౌసల్య పుత్రుడ దశరథ తనయుడ రామచంద్ర

కావు క్షేమముగ భద్రాద్రి నెలకొన్న శ్రీరామచంద్ర ॥ఇక్ష్వాకు॥

భక్తులందరిని పరిపాలించెడి శ్రీరామచంద్ర

నీవు క్షేమముగ శ్రీరామదాసుని నేలుము రామచంద్ర ॥ఇక్ష్వాకు॥

5. వరాళి ఆదితాళం

పల్లవి : ఏడనున్నాడో భద్రాద్రివాసు డేడ నున్నాడో

నాపాలి రాముడేడ నున్నాడో ॥ఏడ॥

ఏడనున్నాడో గాని జాడ తెలియలేదు

నాడు గజేంద్రుని కీడుబాపిన స్వామి ॥ఏడ॥

ద్రౌణీబాణ జ్వాలదాకిన బాలకునికి

ప్రాణమిచ్చిన జగత్త్రాణ రక్షకుడు ॥ఏడ॥

పాంచాలి సభలోన భంగమొందిననాడు

వంచనలేకను వలువలిచ్చిన తండ్రి ॥ఏడ॥

దుర్వాసు డుగ్రమున ధర్మసుతుని జూడ

నిర్వహించిన నవనీత చోరకుడు ॥ఏడ॥

అక్షయముగ శ్రీ భద్రాచలమందున

సాక్షాత్కరించిన జగదేకవీరుడు ॥ఏడ॥

6. నాదనామక్రియ ఆదితాళం

పల్లవి :ఏ తీరుగ నను దయజూచెదవో ఇనవంశోత్తమ రామా

నా తరమా భవసాగరమీదను నళినదళేక్షణ రామా

చరణములు :

శ్రీరఘునందన సీతారమణా శ్రితిజనపోషక రామా

కారుణ్యాలయ భక్తవరద నిను కన్నది కానుపు రామా ॥ఏ తీరుగ॥

మురిపెముతో నా స్వామిని నీవని ముందుగ దెల్పితి రామా

మరువక యిక నభిమానముంచ నేమరుగు జొచ్చితిని రామా ॥ఏ తీరుగ॥

క్రూర కర్మములు నేరక చేసితి నేరములెంచకు రామా

దారిద్ర్యము పరిహారము చేయవె దైవశిఖామణి రామా ॥ఏ తీరుగ॥

గురుడవు నామది దైవము నీవని గురుశాస్త్రంబులు రామా

గురుదైవంబనీ యెరుగక తిరిగెడు క్రూరుడనైతిని రామా ॥ఏ తీరుగ॥

తాండవమున కఖిలాండకోటి బ్రహ్మాండనాయకా రామా

భండనమున నీ నామము దలచిన బ్రహ్మానందము రామా ॥ఏ తీరుగ॥

వాసవకమలభవ సురవందిత వారధిబంధన రామా

సార్చిత మాకభయమొసంగవె దాశరథీ రఘురామా ॥ఏ తీరుగ॥

వాసవనుత రామదాస పోషకవందన మయోధ్యరామా

భాసురవద సద్గుణములు కల్గిన భద్రాద్రీశ్వర రామా ॥ఏ తీరుగ॥

7. కల్యాణిరాగము రూపకతాళము

పల్లవి :ఏమయ్య రామ బ్రహ్మేంద్రాదులకైన

నీ మాయ తెలియవశమా

కామారి వినుతగుణధామకువలయదళ

శ్యామా నన్ను గన్న తండ్రి రామా

సుతుడనుచు కవులు క్షితినాథుడనుచు భూ

పతులు కొలిచిరిగాని పతితపావనుడనుచు

మతి తెలియలేరైరి. ॥ఏమయ్య॥

చెలిమి కొడవనుచు పాండవులు నిజ

విరోధివటంచు నల జరాసంధాదులు కలవాడవని

కుచేలుండు నెరింగిరి గాని ఓజలజాక్ష నిన్ను సేవింపలేరైరి ॥ఏమయ్య॥

నరుడవని నరులు తమ దొరవనుచు యాదవులు

నరుడవనుచు కోపింతురు కరివరద భద్రాద్రిపుర నిలయ

రామదాస పరమాత్ముడని నిన్ను భావింపలేరైరి ॥ఏమయ్య॥

8. పున్నాగరావళి చాపుతాళం

పల్లవి : ఏల దయరాదో రామయ్య నీకేల దయరాదో

మీ మేలుకై పాటుబడితిని యేల మీ భండము చాలుచాలును ॥ఏల॥

చరణములు

బ్రహ్మ గూర్పగదే అహోవరబ్రహ్మకావగదే

బ్రహ్మజనక భవ బ్రహ్మేంద్రాదులు బ్రహ్మానందము పొలైనారట॥ఏల॥

పాపములచేత రామయ్య నేనోపలేను గదే

శ్రీభూపతి యే ప్రాపులేక నీ ప్రాపేగోరితి ఘోరరూపయిక ॥ఏల॥

తలపగడాల ఆనందభాష్పములూరెగదె

నీలినీరదనిభకోమలరూప భద్రశైలవాస రామదాసునేలగ

॥ఏల॥

9. నాదనామక్రియ ఏకతాళం

పల్లవి : కోదండరామ కోదండరామ కోదండరామ కోదండరామ

నీదండనాకు నీవెందుబోకు వాదేల నీకు వద్దు పరాకు ॥కోదండ॥

శ్రీరామ మమ్ము చేపట్టుకొమ్ము ఆదుకొనరమ్ము ఆరోగ్యమిమ్ము

॥కోదండ॥

జయరఘువీర జగదేకవీర భయనివార భక్తమందార ॥కోదండ॥

మణిమయభూష మంజులభాష రణజయ ఘోష రమణీయ వేష

॥కోదండ॥

ఏలరావయ్య యేమందునయ్య పాలింపవయ్య ప్రొడిగనయ్య ॥కోదండ॥

తండ్రివి నీవే తల్లివి నీవే దాతవు నీవే దైవము నీవే ॥కోదండ॥

అద్భుత కుండలామలదండ సద్గుణదండ సమర ప్రచండ ।।కోదండ।।

సరసిజనేత్ర సౌందర్యగాత్ర పరమపవిత్ర భవ్యచరిత్ర ।।కోదండ।।

నీబుద్ధి వీడు ఎరుగనివాడు పాపడువీడు బడలియున్నాడు ।।కోదండ।।

పాపనులేపి ప్రజలనుగల్పి యాపదబాపి యటు ప్రీతిజూపి ।।కోదండ।।

నమ్మిన చిన్నవాడెందున నున్న మమ్ముఁలగన్న మాయన్న వన్న ।।కోదండ।।

ఎవరు మీతోటి ఎవరు మీసాటిరారు మీపాటి రాజులమేటి ।।కోదండ।।

దశరథబాలదాసావన దశముఖకాల ధరణీశపాల ।।కోదండ।।

మారుతభీమ మాల్యాభిరామ కల్యాణనామ కారుణ్యాధామ ।।కోదండ।।

మంజులభాష మణిమయభూష కుంజరపోష కువలయవేష ।।కోదండ।।

పుట్టింప నీవే పోషింప నీవే కులమియ్య నీవే భాగ్యము నీవే ।।కోదండ।।

శరణన్న చోట క్షమచేయుమాట బిరుదునీదౌట నెరిగిన మాట ।।కోదండ।।

రామయ్యవీని రక్షింతుగాని సేవచేసేవాని సుతుడుగానీ ।।కోదండ।।

మురళీవిలోల మునిజనపాల తులసీవనమాల తుంబురలోల ।।కోదండ।।

రావణభంగ రమణీయాంగ మందరోద్ధార మౌక్తికహార ।।కోదండ।।

వందనమయ్య వాదేలనయ్య దండనసేయ తగదు మీకయ్య ।।కోదండ।।

లాలితహాసలక్ష్మివిలాస పాలితదాస భద్రిద్రివాస ।।కోదండ।।

శ్రీవిజయరామ శ్రీతులసిరామ పావనరామ భద్రాద్రిరామ ।।కోదండ।।

10. యమునా కల్యాణి ఆదితాళం

పల్లవి :గరుడగమన రారా నను నీ కరుణ నేలుకోరా

పరమపురుష ఏ వెరవులేక నీ మరుగుజొచ్చితిని

అరమర సేయక ॥గరుడ॥

పిలువగానేరమ్మి అభయము తలపగానెయిమ్మి

కలిమిబలిమి నాకలలో నీవని పలవరించిన నన్ను గన్నయ్య ॥గరుడ॥

పాలకడలిశయనా దశరథబాల జలజనయనా

పాలముంచిన నీటముంచిన నీపాలబడితిని జాలము సేయక ॥గరుడ॥

ఏలరావు స్వామి నను నిపుడేలుకోవదేమి

ఏలువాడవని చాలనమ్మితిని ఏలరావు కరుణాలవాల హరి ॥గరుడ॥

ఇంతపంతమేల భద్రగిరీశ వరకృపాళ

చింతలణచి శ్రీరామదాసుని అంతరంగపతివై రక్షింపుము ॥గరుడ॥

11. కాఫీ ఆదితాళం

పల్లవి : చరణములే నమ్మితి నీదివ్య చరణములే నమ్మితి

॥చరణములే॥

వారధిగట్టిన భద్రాచలవరదా వరదా నీ దివ్య ॥చరణములే॥

ఆదిశేష నన్నరమర చేయకుమయ్యా నీ దివ్య ॥చరణములే॥

వనమున రాతిని వనితగచేసిన చరణము శరణము నీ దివ్య

||చరణములే||

పాదారవిందమే యాధారమని నేను పట్టితి పట్టితి నీ దివ్య

||చరణములే||

బాగుగా నన్నేలు భద్రాచల రామదాసుడదాసుడ దాసుడ దాసుడ

||చరణములే||

12. నాట ఝంజాతి ఏకతాళం

పల్లవి : జయ జానకీరమణ జయ విభీషణశరణ

జయ సరోరుహచరణ జయ తమోహరణ ||జయ||

జయ త్రిలోక శరణ్య జయభక్త కారుణ్య

జయవణ్య లావణ్య జయ సద్వరేణ్య ||జయ||

సకలలోక నివాస సాకేత పురవాస

అకలంక నిజహాస అబ్జహాస అబ్జముఖభాస ||జయ||

శుకమౌని నుతపాత్ర శుభరమ్య చారిత్ర

మకర కుండలవక్త్ర మహనీయగాత్ర ||జయ||

కమనీయ కోటీర కౌస్తుభాలంకార

కమలాక్ష రఘువీర కలుష సంహార ||జయ||

సమరరిపు జయధీర సకలగుణ గంభీర

అమల హృత్సంచార అఖిలార్తిహారా ||జయ||

రూపవర్జితమార రుచిర సద్గుణశూర
భూపదశరథకుమార భూరియాభరణహర ॥జయ॥
పాపసంఘవి విధార పంక్తిముఖ సంహార
శ్రీపతే సుకుమార సీతావిహార ॥జయ॥

13. నాదనామక్రియ ఆదితాళం

పల్లవి : తక్కువేమి మనకు రాముండొక్కడుండువరకు
ప్రక్కతోడుగా భగవంతుడు మనచక్రధారియై చెంతనెయుండగ

చరణములు

ముచ్చుసోమకుని ముసు జంపినయా
మత్స్యమూర్తి మన పక్షముండగను ॥తక్కువేమి మనకు॥
సురలకొరకు మందరగిరి మోచిన
కూర్మావతారుని కృప మనకుండగ ॥తక్కువేమి మనకు॥
దురాత్మునా హిరణ్యాక్షు ద్రుంచిన
వరాహమూర్తి మనవాడై యుండగ ॥తక్కువేమి మనకు॥
భూమి స్వర్గమును పొందగ గొలిచిన
వామనుండు మనవాడై యుండగ ॥తక్కువేమి మనకు॥
ధరలో క్షత్రియులను దండించిన
పరశురాముడు మనపాలిట నుండగ ॥తక్కువేమి మనకు॥

దశగ్రీవు మును దండించినయా
దశరథరాముని దయ మనకుండగ ॥తక్కువేమి మనకు॥
ఇలలో యదుకుల మందుదయించిన
బలరాముడు మన బలమైయుండగ ॥తక్కువేమి మనకు॥
దుష్టకంసుని ద్రుంచినట్టి
శ్రీకృష్ణుడు మనపై కృపతో నుండగ ॥తక్కువేమి మనకు॥
కలియుగాంతమున కలిగెడి దైవము -
కలికి మనలను గావగ నుండగ ॥తక్కువేమి మనకు॥
రామదాసుని గాచెడి శ్రీమ
న్నారాయణు నెరనమ్మి యుండగ ॥తక్కువేమి మనకు॥

14. గౌళీపంతు ఏకతాళం

పల్లవి : తలుపు తియ్యయ్య తానీషా
నీకియ్యెడ పైకము నియ్యవచ్చితిమయ్య ॥తలుపు తియ్యయ్య॥
ఫాలనేత్రుని తుమ్మిపూల పూజించిన
మేలుదొరవు నీవు మేలుకోవయ్యా ॥తలుపు తియ్యయ్య॥
నీలకంఠుని మల్లెపూల నర్చించిన
మేటి దొరవు నీవు మేలుకోవయ్య ॥తలుపు తియ్యయ్య॥
దీనుడైన రామదాసు పై నీవభి

మానముగను కృపబూని వేగముగ ॥తలుపు తియ్యయ్య॥

15. ధన్యాసి ఆదితాళం

పల్లవి : తారకమంత్రము కోరిన దొరికెను ధన్యుడనైతిని ఓరన్నా
మీరినకాలుని దూతలపాలిటి మృత్యువుయని మదినమ్మన్నా ॥తారక॥

మచ్చికతో నితరాంతరంబుల మాయలలో బడబోకన్నా
హెచ్చుగ నూటయెనిమిది తిరుపతు లెలమితిరుగ పనిలేదన్నా
॥తారక॥

ముచ్చటగా నా పుణ్యనదులలో మునిగెడి పనియేమిటికన్నా
వచ్చెడి పర్వదినములలో సుడిపడుటయు మానక యుండన్నా
॥తారక॥

ఎన్ని జన్మములనుండి చూచినను ఏకోనారాయణుడన్నా
అన్ని రూపులైయున్న నాపరమాత్ముని నామము కథవిన్నా ॥తారక॥

ఎన్ని జన్మములజేసిన పాపము లీజన్మములో విడునన్నా
అన్నిటికిది కడసారి జన్మము సత్యంబిక పుట్టుకసున్న ॥తారక॥

నిర్మల మంతర్లక్ష్యభావము నిత్యానందముతో నున్న
కర్మంబులు విడి మోక్షపద్ధతిని కన్నుల జూచుచునున్న ॥తారక॥

ధర్మము తప్పక భద్రాధీశుని తనమదిలో నమ్మక యున్న
మర్మము దెలిపిన రామదాసుని మందిరమున కేగేచునున్న ॥తారక॥

16. కల్యాణి రాగము ఆదితాళం

పల్లవి : నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లి

నను బ్రోవమని చెప్పవే

నను బ్రోవమని చెప్పు నారీశిరోమణి

జనకుని కూతురు జనని జానకమ్మ ॥నను॥

ప్రక్కనచేరిక చెక్కిలినొక్కుచు

చక్కగ మరుకేళి జొక్కియుండు వేళ ॥నను॥

లోకాంతరంగుడి శ్రీకాంత నినుగూడి

ఏకాంతముననేక శయ్యనున్న వేళ ॥నను॥

అద్రిజ వినుతుడు భద్రగిరీశుడు

నిద్రమేల్కొనువేళ నెలతరో బోధించి ॥నను॥

17. ఆనందభైరవి ఆదితాళం

పల్లవి : పలుకే బంగారమాయెనా కోదండపాణి ॥పలుకే॥

చరణములు

పలుకే బంగారమాయె పిలిచిన పలుకవేమి

కలలో నీ నామస్మరణ మఱవ చక్కనితండ్రి ॥పలుకే॥

ఇరువుగ నిసుకలోన బొరలిన యుడుతభక్తికి
కరుణించి బ్రోచితివని నెరనమ్మితి నిన్నేతండ్రి ॥పలుకే॥

రాతినాతిగజేసి భూతలమున ప్ర
ఖ్యాతిచెందితివని ప్రీతితో నమ్మితి తండ్రి ॥పలుకే॥

ఎంత వేడిన గాని సుంతైన దయరాదు
పంతంబు సేయ నేనెంతటివాడను తండ్రి ॥పలుకే॥

శరణాగత త్రాణ బిరుదాంకితుడవు గావ
కరుణించి భద్రాచల వరరామదాసపోషక ॥పలుకే॥

18. యదుకుల కాంభోజి ఆదితాళం

పల్లవి : పాహిమాం శ్రీరామాయంటె పలుకవైతివి
నీ స్నేహమిట్టిదని నేచెప్పనో హోహోహోహోహోహో॥పాహిమాం॥

ఇబ్బంది నొంది యాకరి బొబ్బ పెట్నింతలోనే
గొబ్బున గాచితివట నేనెంతో జాగు సేయక
నిబ్బరముతో నేనెంతో కబ్బమిచ్చి వేడుకొన్న
తబ్బిబ్బు చేసేదవు దామ అబ్బబ్బబ్బబ్బబ్బ ॥పాహిమాం॥

సన్నుతించు వారినెల్ల మున్నుదయతో బ్రోచితివని
పన్నగశాయినే నిన్నే విన్నవించితి
విన్నపము వినక యెంతో కన్నడజేసెదవు రామా

యెన్నటికి నమ్మరాదు రన్నన్నన్నన్నన్న ॥పాహిమాం॥

చయ్యన భద్రాద్రినిలయ స్వామివని నమ్మి నేను

వేయారు విధముల నుతిచేయసాగితి

ఈయెడను రామదాసుని కుయ్యాలించి ప్రోవకున్న

నీయొయ్యార మేమనవచ్చు నయ్యయ్యయ్యయ్యయ్యయ్యో

॥పాహిమాం॥

19. పంతువరాళి ఆదితాళం

పల్లవి : రామనామము బల్కవే పాపపు జిహ్వ

రామనామము బల్కవే ॥రామనామము॥

రామనామము నీవు ప్రేమతో బల్కిన

స్వామి యెల్లప్పుడు కామితార్థములిచ్చు ॥రామనామము॥

మతిలేనివారలెల్లరు సీతాపతిని సతతము దలచినను

హితవున వారి పూర్వకృతములెల్ల మాన్పి

అతులిత సామ్రాజ్యానంత మొందజేయు ॥రామనామము॥

మారసుందరాకారుని వేసారకెపుడు

కోరి భజించుచుండ నీ భూరికృత

కిల్బిషదోషములన్నియు చేరనీయగొట్టిపారద్రొలేటిదగు ॥రామనామము॥

దోషములెల్ల బాపి వాసిగ ధరలో

రామదాసుని హృదయ నివాసుడైనసీతా ॥రామనామము॥

20. మధ్యమావతి ఆదితాళం

పల్లవి : రామానను బ్రోవరాగద నన్ను గన్న సీతా

భామామణికైన జాలిలేదా నామీద నీకు ॥రామా॥

ప్రేమ లేకుండుట మర్యాద రక్షింప భార

మే మీకులేదా భద్రాచలధామ సుంతైన నెవరు తలుపున నిలుచుకద

॥రామా॥

నీలోన జగములుండుగాద జగములోన లీలతో

నీవుందుగాద మీజాలిచేత మేలుగ నుండుట పరాకా ఎంతోవేడితి నిక

॥రామా॥

నానాటికెంతో సులభమున నీవను పెన్నిధానముదొరికెనుమాకు

చేసెనా ఎటులైన నినుమానానా కన్నులార పరదైవాలను

మ్రొక్కెదనా జరుగవచ్చినా నేనీ వాడగానా ॥రామా॥

ఈసమయంబున రామదాసపోషక చిద్విలాసభద్రాచలవాస

తెలిసి కృపజేసి రక్షింప ప్రయాస అనువర్ధనివాసా

గాసిమాన్పు శ్రీనివాస బ్రోవకుండుటిది బాసా ॥రామా॥

21. అసావేరి చాపుతాళం

పల్లవి : రామచంద్రులు నాపైచలము చేసినారు సీతమ్మ చెప్పవమ్మ

కటకటవినడేమి సేయుదు కఠినచిత్తుని మనసు కరుగదు

కర్మములు నెటులుండునోగద ధర్మమే నీకుండునమ్మ ॥రామచంద్రుడు॥

దినదినము మీచుట్టు దీనతతో దిరుగ దిక్కెవ్వరిక నోయమ్మ

దీనపోషకుడనుచు వేడితి దిక్కులన్నియు ప్రకటమాయెను

ఒక్కమాటైనను వినడు ఎక్కువేమని తలతునమ్మ॥రామచంద్రుడు॥

కౌసల్యతనయుడు కపటము చేసినాడు కారణమిటుండెను

కన్నడచేసెదవా నీ కన్నుల వైభవంబు విన్నవింపగదమ్మ

నీ కన్న దిక్కెవ్వరోయమ్మ ॥రామచంద్రుడు॥

దశరథాత్మజుడెంతో దయాశాలియనుకొంటి ధర్మహీనుడేయమ్మ

దాసజనులకు దాతయతడట వాసిగ భద్రగిరీశుడట రామదాసుని

ఏలరాడట రవికులాంబుధి సోముడితడట ॥రామచంద్రుడు॥

22. బిళహరి చాపుతాళం

పల్లవి : రావయ్యా భద్రాచలరామ శ్రీరామ

రార రమణీయ జగదభిరామ లలామా

కేవలభక్తి విలసిలు భావముదెలిసి దేవుడవైతే ॥రావయ్యా॥

ప్రొద్దు ప్రొద్దున నిన్ను పొగడుచు నెల్లిపుడు

ప్రొద్దు మీరగాను భజన చేసెదను

గద్దరితనమున ప్రొద్దులు పుచ్చుము

ముద్దులు గులుకుచు మునుపటివలె నిటు ॥రావయ్యా॥

నన్ను గన్న తండ్రి నా మదిలోన
నీకన్న నితరముల గొలిచెదనా
శ్రీకరదివ్య ప్రభాకర కులరత్నా
శరత్పూర్ణ సుధాకర తేజా ॥రావయ్యా॥
అంజలి జేసెద నరమరలేక
అమిత కటాక్షము నాపైని పూని
ముజ్జగములకు ముదమిడు పదముల
గజ్జెలు గలగల ఘల్లుఘల్లు మన ॥రావయ్యా॥
దోషము నెంచని దొరవని నీకు
దోసిలియొగ్గితి తొలుత పరాకు
దాసుని తప్పులు దండముతో తీరె
మోసము గలిగిన దాసపోషకుడవై ॥రావయ్యా॥

23. నాదనామక్రియ ఆదితాళం

పల్లవి : వినరయ్య తానీషాగారు మా మనవి చేకొనరయ్య మహారాజ మీరు
॥వినరయ్య॥
దినదినమును వారియింట విప్రవరుల సంతర్పణం
విందులవంట చేసేది సర్కారులంట
ఋజువు చేస్తాము సర్కారులను బంపువెంట ॥వినరయ్య॥

దండికాపులు బలిసిరందుచేసి చేసెడు తంటాలు నేమనుకొందు

ఆరులక్షల పైకమందునిలచి సర్కారునకు రాకపోయెనందు ॥వినరయ్య॥

బొక్కసములు పాడాయె దేవాలయములు బహుచక్కనాయె

తక్తాధికారులు మీరు తహసీలు చేసెడి గోపన్నగారు॥వినరయ్య॥

చాలతంటాలు జేసినారు తానీషాపైకమంత కొల్లగొట్టుచున్నారు

రామచంద్రుని నమ్మినారు శ్రీ భద్రాద్రిపురమందు దాగియున్నారు

॥వినరయ్య॥

జాగుసేయక యిక మీరె వారిని రప్పింప దెలియనతని కార్బారు

॥వినరయ్య॥

24. గౌళీపంతు ఆదితాళం

పల్లవి : శ్రీరామ నీ నామమెంత రుచిరా

ఓరామా నీ నామ మేమి రుచిరా

కరిరాజా ప్రహ్లాద ధరణి విభీషణుల

గాచిన నీనామ మేమి రుచిరా ॥శ్రీరామ॥

గోవిందు నేవేళ గొలుతాం గొలుతాం

దేవుని గుణములు దలుతాం దలుతాం ॥శ్రీరామ॥

విష్ణుకథలు చెవుల విందాం విందాం

వేరే కథలు చెవుల మందాం మందాం ॥శ్రీరామ॥

రామదాసులు మాకు సారాం సారాం
కామదాసులు మాకు దూరం దూరం ॥శ్రీరామ॥
నారాయణుని మేము నమ్మేం నమ్మేం
నరులనింక మేము నమ్మాం నమ్మాం ॥శ్రీరామ॥
మాధవ నామము మరువాం మరువాం
మరి యమబాధకు వెరువాం వెరువాం ॥శ్రీరామ॥
అవనిజపతి సేవ మానాం మానాం
మరియొకజోలంటే మౌనాం మౌనాం
భద్రగిరీశుని కందాం కందాం
భద్రముతో మన ముందాం ముందాం ॥శ్రీరామ॥

25. సావేరి ఆదితాళం

పల్లవి : సీతారామస్వామీ నేజేసిన నేరమేమి
ఖ్యాతిగ నీపదకంజ యుగళమునే
ప్రీతిగ దలపగ భేదమెంచితినా ॥సీతా॥
రంగుగ నాపదివేళ్ళకు రత్నపుటుంగరములు నిన్నడిగితినా
సరిగ బంగారు శాలువ పాగాలుంగీల్ నడికట్లడిగితినా
చెంగట భూసురపుంగవు లెన్నగ చెవులకు చౌకట్లడిగితినా

మువ్వలు గొలుసులు ముత్యపుసరములు అంగనలకు నిన్నడిగితినా

॥సీతా॥

ప్రేమతో నవరత్నంబులు దాపిన హేమకిరీటంబడిగితినా

కోమలమగు మెడలో పుష్పదామములిమ్మని యడిగితినా

మోమాటము పడకుండగ నీదగు మురుగులు గొలుసుల నడిగితినా

కమలేక్షణ మిము సేవించుటకై ఘనముగ రమ్మని పిలిచితిగాని

॥సీతా॥

తరచున నీ పదముల నమరిన సరిగజ్జెల నిను నేనడిగితినా

కరుణారస ముప్పొంగ గజతురగము లిమ్మని నేనడిగితినా

పరమాత్మ నీ బంగారుశాలువ పై గప్పుగ నేనడిగితినా

స్మరసుందరవర సంరక్షణ ధనమిమ్మని నిన్నడిగితినా॥సీతా॥

ప్రశస్త భద్రాధీశుడవని ప్రభుత్వమిమ్మని యడిగితినా

దశరథ సుతనీచేత ధరించిన దానకంకణం బడిగితినా

విశదముగా నీమేలిమి మొలనూల్ వేడుకతో నిన్నడిగితినా

ఏలుము భూమిని కుచ్చల నేలకు నెక్కువగా నిన్నడిగితినా ॥సీతా॥

26. వరాళి రూపతాళం

పల్లవి : అడుగుదాటి కదలనియ్యను

నాకభయమియ్యక నిన్నువిడువను

గడియ గడియ తిరిగి తిరిగి యడిగితిని వేసరగ వచ్చెను

గడువు దప్పినను నిక బహుదుడుకుతనములు చేయుదునిను

॥అడుగు॥

కుదురుగ గూర్చుండనియ్యను నీకు కోపమొచ్చిన భయపడను

మరల నెరిగియునింక నీ మొగమాటమేమియు లేదుగద నా

హృదయకమలమునందు నీ మృదుపదములను బంధించి వేయుదు

రేపు మాపని జరిపితే నే నాపుపెసెడి వాడగాను

ప్రాపు నీవనినమ్మి గొలిచిన పావముల నెడబాపి దయతో

తేవతేవక నీదుమోమిటు చూపకుండిన నోర్వసుమ్మి॥అడుగు॥

పతితపావన బిరుదు లేదా నన్ను పరిపాలన చేయరాదా

ప్రతిదినంబును దేవనిను భూపతినటంచును వేడినను నీ

హితజనంబులు వచ్చి నన్ను వేడుకొనినను విడువ నిన్ను ॥అడుగు॥

రాక్షసాంతక సీతారమణాసారసాక్ష సద్గుణ భక్తాభరణ

యీక్షణంబున దీనజనుడని మోక్షమియ్యక యుంటివెనను

సాక్షిబెట్టియు నేడు నేనొక దీక్షచే సాధింతునిన్ను॥అడుగు॥

భూరిభద్రాచల నివాసరామ భుజగశయన భక్తపోషా

కూరిమిగ నినువిడిచిపెట్టిన ధరణిలో భద్రాద్రిరాఘవ

రామదాసుండనెడి నామము మారుపేరున బిలువు నన్ను ॥అడుగు॥

27. బేగడ ఆదితాళం

పల్లవి : అని యిట్లురామదాసు డనుకొనుచు సీతారాములకడ కేగెను

పనిబూనిభక్తవత్సల రామచంద్ర నా మనవి చేకొమ్మనెను

॥అనియిట్లు॥

వినవయ్య నీకు నేవిన్న వింతనొక్క ఘనకార్య మీవేళను

అనువొందనెల్ల రాజ్యము గొనియాడ పాపసముగ వేనోళ్ళను

॥అనియిట్లు॥

దానపోషణ బిరుదాంక సజ్జనులను గాసి నొందగ జేతురా

ఏసీమనైన దినేశవంశజులిట్లు మోసము చేయుదురా॥అనియిట్లు॥

కరి మొరలిడనాడు త్వరగను నేగి మకరినుంచికరిగావవే

పరమపావన రామ చెరసాలనున్న భూసురునేలరక్షింతివో

॥అనియిట్లు॥

అతిపాపియైన యజామిళునేలి వతడేమి నీ చుట్టమా

పతితపావన రామ భద్రాద్రినిలయ నన్ పాలింపవిది దిట్టమా

॥అనియిట్లు॥

భద్రగిరీశుడ భక్తులపాలిట పారిజాతంబనుచు

భద్రాత్ముడై యున్న వాడు రామదాసు పాలించెదవనుచు

॥అనియిట్లు॥

28. ధన్యాసి చాపు తాళం

పల్లవి : అబ్బబ్బా రామ నామమది

సారము లేని సంసారసార మిదే రామనామం

పారద్రోలు మున్నూట ఇరువది భవరోగములన్ని

చేరి పంచేంద్రియములన్ని చేరక పారదోలు నామం

ఘోరమైన యమదూత కొట్టెడి నామం ॥అబ్బబ్బా॥

దినదినము జిహ్వాకింపై దీయగనుండు నామం

ధనకనక వస్తువులు దయచేయు నామం

అసలు కొసలు నొక్క సమాభివృద్ధి చేయునామం

తనువును రెండనుచు తుదిని తారక నామం ॥అబ్బబ్బా॥

ముక్కంటిసతికి శాశ్వత కీర్తినిచ్చె రామనామం

ఎక్కువైన వాల్మీకి ఋషికి యెప్పుడనుష్ఠానం

ఒక్కసారి రామాయన్న ఓం భూస్వాహా పాపములన్ని

మ్రొక్కి రెండుమారులన్న మోక్షమునకు ॥అబ్బబ్బా॥

దగ్గర రాముడు మన్మథుడు దవ్వులనుండు

దుష్కర్మలు గొబ్బున మోహపాశముల తెగగోయు నామం

మబ్బుదూరి కొండవంటి మొయిలు ముట్టిన పాపములనే

మినుగురువలె గాల్చును రామనామం ॥అబ్బబ్బా॥

కామక్రోధలోభమోహ గర్వమడచు రామనామం

స్వామి భద్రాద్రీశుని సద్గతి నామం

నీమముతో బిలిచిన నితగ మోక్షపదవి నామం
రామదాసు నేలిన శ్రీరామ నామం ॥అబ్బబ్బా॥

29. వరాళి రూపకతాళం

పల్లవి : అయ్యయ్యోచెల్ల యీ జీవునకు సుఖమెయ్యెడలేదుగదా
రామయ్య జన్మాలు ఎన్నెన్నో గలవయ్య
చయ్యన రఘుకుల సార్వభౌమ చందాన బ్రోచేవో రామయ్య
వనజనాభుని మాయతెలియకనే వెఱ్ఱివగల బొందుచు నుంటిగాకొన్నాళ్ళు
మునుపుజేసిన పుణ్యాపాప సంఘములచే మునిగితేలుచుంటిగాకొన్నాళ్ళు
యెనుబడినాలుగులక్ష యోనులందెల్ల వేసరక పుట్టితిని కొన్నాళ్ళు
అనయమున నరకమనుభవించి స్వర్గమంతట జొచ్చితిగ ఓరామ
॥అయ్యయ్యో॥
ఆలంబనము లేక నాకాశమందున నలసటనొందితిరా కొన్నాళ్ళు
మేలు తెలియగ మిన్నులోపల జిక్కుమినుగక నుంటిగద కొన్నాళ్ళు
~~ఈ~~లాగుతావచ్చి మేఘమధ్యమునందు నిడుమలపడుచుంటిగా కొన్నాళ్ళు
జాలినొంది సూర్యకిరణములలో జొచ్చి చలనము నొందితిగ
కొన్నాళ్ళు॥అయ్యయ్యో ॥
ఓ రామయ్య వర్షములో జిక్కి వసుమతిమీదనే వర్తించు చుంటిగద
కొన్నాళ్ళు

వరుసశేషసస్యగతమైన ధాన్యమును వదలి వర్తించితిగదకొన్నాళ్ళు
వరశరుని తేజస్సువల్ల నారీతనువల్ల నోరీగర్భనరకమునబడి యుంటిగ
ఓ రామ ॥అయ్యయ్యో॥
త్రిప్పుడు తిత్తిలోబడి దినము ప్రవర్తిల్లు చుంటిగద కొన్నాళ్ళు
అప్పుడు మాతల్లి యుప్పుపులుపు దిననంగలార్చుచుండ కొన్నాళ్ళు
ఎప్పుడు నిందుండి బదులు వెళుదునని ఎదురుచూచుచుంటిగ
కొన్నాళ్ళు
చెప్పరానియట్టి ద్వారములోనుండి జననమునొందితి ఓరామ
॥అయ్యయ్యో॥
పొరలుచు దురగాధపొత్తిలోనలిగిరనుచుచు పోనుంటిగద కొన్నాళ్ళు
పెరుగుచు బాల్యావస్థల దినముల పరుగులాడుచుంటిగదకొన్నాళ్ళు
తరుణంతోగూడి మదమత్సరముల కన్నెరుగనైతిగద కొన్నాళ్ళు
తరువాత దారాపుత్రాది మోహములదవిలి వర్తించిగద ఓ రామా
॥అయ్యయ్యో॥
తలయుతెల్లనై దంతములూడి వణకుచు అడిబడుచుంటిగద కొన్నాళ్ళు
తలుపుదగ్గరచేరి బనిబిక్షుకులనైతి తగిలి దిట్టుచునుంటిగద కొన్నాళ్ళు
పిలిచినదాని పెండ్లాము బిడ్డలచేత నిడుమలబడుచుంటిగద కొన్నాళ్ళు
బలముదీరి కండ్లు పొరలుగప్పి పరులబ్రతిమాలు చుంటిగద ఓ రామా
॥అయ్యయ్యో॥

ఆచట మృతినొందియలయుచు యమునిచే నానాబాధ లొందితిగద

కొన్నాళ్ళు

వింతగా నీరీతిపుట్టుచుగిట్టుచు బాధలుపడుచుంటిగద కొన్నాళ్ళు

కంజనయన భద్రాచలపతివగు నిన్ను గనరకతిరిగితినిగదకొన్నాళ్ళు

వింతగనే రామదాసుడనైతి నికనెట్లు బ్రోచెదవో ఓ రామా

॥అయ్యయ్యో॥

30. అసావేరి ఆదితాళం

పల్లవి : అయ్యయ్యో నే నేరనైతిని

అదినారాయణుడని దెలియనైతిని

వెయ్యారుజన్మాల వెతలజెందితిగాని

చయ్యన సద్గతి సాధింపలేనైతిని ॥అయ్యయ్యో॥

మోసమే మదితలచి యుందు

ఆశపాశముల తగిలి నే యుందు

ఆశాపాశములన నరసి బ్రోచి ముందు

వాసిగ వైరాగ్య వాసన గననైతి ॥అయ్యయ్యో॥

మూడు మేలని నమ్మి యుంటి

నిరుమూఢ శత్రులగూడి యుంటి

మూటి రెంటి మార్చి మూటికెక్కువయైన

కూటస్థు పొడగని కూడలేనైతి   ॥అయ్యయ్యో॥

బంధకములు ద్రుంచి నేను

భద్రగిరి రాఘవుతోను గలిసి నే

సదయుడయి నెలకొన్న శ్రీరామదాసుని

స్థిరముగ చేపట్టి పోషించుమననైతి ॥అయ్యయ్యో॥

31. అసావేరి  రూపకతాళం

పల్లవి : ఆవుమీ హమర బాద్‌టిటికి చల్ మీ

గోల్కొండకు చల్ మీ అరే లేవు మీ

అంటె యేమోయోచించేవు మీ అరే అరే ఉటో ఉటోచల్॥ఆవుమీ॥

తివాసిదిండటిక్కా నేడుదిగూ నవాబు హుకుమిదిచూడు

జవాబు మాతోసరిగా నేడు చెప్పి నీవు మానము కాపాడు       ॥ఆవుమీ॥

అవురంగ బాదుతఖత్తులోన అనేక తహాసీల్దార్లున్నారు

వారిపై నున్న ఏమో నీపై బాకీశానా                    ॥ఆవుమీ॥

నిముషమైనా నిలువనీయము నిలువలన్ని ఝటాపైకము

చేకొనుము వేగమే యిపుడు చేర్బందు చేసుకొందుముచూడు

॥ఆవుమీ॥

ఆవు లే కానీ యీ సీమకధికారైన వెరువాము

మీదొక భద్రాద్రి శ్రీరామదాసుడని తాళలేముసుమ్మి॥ఆవుమీ॥

32. నాదనామక్రియ ఆదితాళం

పల్లవి : ఆనందమానందమాయెను శ్రీజానకిరామస్మరణచేయును

నేడార్యుల కృప మాకుగల్గెను ఇప్పుడిరువ దేడింటనున్న రాజును

జూడగానే ॥ఆనంద॥

పరమభక్తి శ్రద్ధగల్గెను  బహుదురితజాలములెల్ల దొలగెను

పలురాగద్వేషమువల్ల వీడెఅట్టె రాజయోగమందున్న పరమాత్మ జూడగనే

॥ఆనంద॥

పూర్వపుణ్యములొనగూడెను శ్రీపార్వతి జపమంత్రమీడేరెను

పూర్వకృతంబు కనబడేను పరమపావనమైన శ్రీహరి సేవ గల్గెనేడు

॥ఆనంద॥

సామాన్యులచెంత చేరము వట్టిపామర జనులనింక గూడము

విషయ కామములజేరి వేడము

మాకు హరినామస్మరణజేయు పరమభాగవతులు దిక్కు ॥ఆనంద॥

రామభక్తుల జేరగల్గెను ఇతర కామముల్లను వీడగల్గెను

పరభామలపైన భ్రాంతి దొలగెను మేము నరులదోషము లెన్న మొరులకు

నెదురాడము ॥ఆనంద॥

ఇతర చింతలు చేయమువేరే ఇతరదైవమును గొలిచియాడము

ధరాపతులకు మ్రొక్కింతలు చేయము ఇనకులచంద్రుడైన

భద్రాద్రిస్వామి మాదుదైవము పేరు
క్షుద్రదేవతలను దలపము దారిద్ర్యములనెల్లమది నెంచము
భద్రగిరి రామదాసు నేలిన పరమదయాళుడు గల్గె॥ఆనంద॥

33. కాంభోజి చాపుతాళం

పల్లవి :ఆనబెట్టితినని ఆయాసపడవద్దు రామచంద్ర
నాపామరత్వముచేత బ్రతిమాలికొనియెద రామచంద్ర॥ఆన॥
తామసింపక యిత్తరి నన్ను కృపజూడు రామచంద్ర
తడియక మీ తల్లి దండ్రియాన తీరు రామచంద్ర॥ఆన॥
సేవకునిగా జేసి చేయిబట్టి రక్షింపు రామచంద్ర
చెలువుగ సీతాదేవి యానతీరు రామచంద్ర ॥ఆన॥
కోరిక దయచేసి కొదవలు దీర్చుమో రామచంద్ర
కొమరొప్ప మీ కులగురువాయుదీరు రామచంద్ర॥ఆన॥
సెనరుంచి నామీద నిరతము బ్రోవుము రామచంద్ర
వినయమిగా సౌమిత్రి యానతీరు రామచంద్ర ॥ఆన॥
వేడుకమీరగ వేగరక్షింపుమి రామచంద్ర
జోడుగ భరత శత్రుఘ్ను లానతీరు రామచంద్ర ॥ఆన॥
జంటగ మీ వెంట బంటుగ నేలుము రామచంద్ర
తంటలేని మీయింటి యానతీరు రామచంద్ర ॥ఆన॥

ఆదరింపుము నన్ను అడియేన్ దాసుడ రామచంద్ర

వాడేల రామదాసుని బ్రోవుమిక రామచంద్ర ||ఆన||

34. ఆనందభైరవి ఏకతాళం

పల్లవి : ఆశపుట్టె శ్రీరాములతో ఆహా నే పుట్టనైతి

రఘురాములతో నే పుట్టనైతి

శ్రీరాములతో బుట్టి సేవలు సేయగనైతిని

దశరథనందుడై దాశరథి రాములవశముగ బాలురతో

వరదుడై యాడగ వనజనాభునకు దాసుడనై నే భయభక్తితోడ||ఆశ||

సకల సేవలుసల్పుచుమురియునుఅకటనలుగురితోనాడుకొనుదుగద

అయోధ్యాపురిలో గజమునెక్కి అత్యుతుండు రాగాను నాట్యమాడుచు

నన్ను రక్షింపుమంచును విశ్వామిత్రుని వెంటపోగా నేనునుపోదును

జనకుడు హరికి ||ఆశ||

జానకిని పెండ్లాడగ వారిద్దరికి నే శేషబియ్యము నిత్తును

అమ్మవారికి ఆకులమడచి యిత్తును నరులార యితడే నారాయణుడని

చాటుదును ||ఆశ||

మనలను రక్షించే మాధవుడు వచ్చేనందును మన గతి యేమందు

ప్రభు దశరథునే బతిమాలుదుగద కైకేయిని నే గాదనందుగద

రామునికైన రాజ్యమిత్తుగద ప్రభవయి యేలగ నేనొనర్తుగద

అడవికి బోవ నంటిపోదుగద గుహునితో గూడుక కూడి మురియుదుగద

॥ఆశ॥

నిల్చి దానవుల నెత్తి గొట్టుదుగద కరయుద్ధంబున గౌగలింతుగద

కనకమృగమును రామకాంత తెమ్మంటె ఓ నిర్దయులార అయ్యోనేపోయి

ఆ మృగమును దెచ్చి అమ్మకిత్తుగద హరిని నేనుపోవదందునుగద

ఈ మృగమువెంట, దశముఖు డంతట తపోవేషమున

దశముఖు తన శౌర్యముజూపగ జానకి వణకగ ఆ రావణుడు సీతమ్మను

చెరపట్టగ

అప్పుడు నేనుంటే అమ్మ కభయ మిత్తును ॥ఆశ॥

ఆ శ్రీపాదములునట్టే పట్టుకనే మ్రొక్కుదును

హరి దుఃఖింపగ అమ్మజాడ దెత్తును

సర్వజ్ఞమూర్తి చాలు నీ విరహమందును

విశ్వములో నందరు విన నట్లూరకుండిరీ

సురవరులందరు సుఖంబుగ జూచుచుండిరి

అయ్యో యిదేమని ఆ బ్రహ్మాదుల శపింతునుగద॥ఆశ॥

మిత్రవంశునకు నేనేమి చేయుదు నేనెవ్వరివేడుదు

ఏమరియుండిరీ మానినులందరు ఏలపోయెనో యాక్షీరాబ్ధికి

ఏల దశరథుడు యజ్ఞము చేసెను ఎందుకు బుట్టిరియీలోకమునను

ఎందుకు వచ్చిరి యీవనమునకును ఇట్టి వరములనేలవేడిరి

ఎక్కడ నోపుదు యింతటి జాలి ॥ఆశ॥

పంపాతీరమున పరిమార్చి కబంధుని

ఇంపుగ శబరివిందులు యిష్టములోజేసి

ఇంద్రసూనుని హతముగావించి ఆంజనేయాంగదముఖ్యాదులు

మంజులవాణిని మరువక వెతకగ వారలతోగూడి వెడుదుగద

వైదేహిని ప్రేమతో సహాయముగా రమ్ము

సముద్రము నే చౌకళించి వేగ దుముకుదును

లంకను గాలించి పంకజాక్షిని నే సేవింతును

సంపాతి పోకముందు ॥ఆశ॥

అంగుళీయకమిచ్చి అమ్మా హరి యిచ్చెనందును

ఆవృత్తాంతము హరికినే విన్న వింతును

జానకిరామ జాగేల రమ్మందును అపరాధిని నేనని వారికి వాహనము

ఆంజనేయుడు ఆ లక్ష్మణునకు అంగదడా

ప్రభు రాములనే ప్రార్థించెదనుగద సేనలగూడుక చెండాడుదుగద ॥ఆశ॥

కపులచే వారధి గట్టింతుగద సముద్రుడా యిది సమయమందు

గద హరిసేనతో పనులాచరింతుగద వలీముఖులకుగల బలము

జూతుగద శుభరామునితో సొంపు నొందుగద ॥ఆశ॥

లక్ష్మణాగ్రజుడు సేనసురావించి లక్ష్మికొరకు కపి లంక జుటంగ

రక్షించు భద్రాద్రివాసుడనై రణములో రావణుని ద్రుంతును

ఆ క్షణమున రఘువరునప్పుడే సేబిలుతును మంగళ పతివ్రతను

మాధవుకర్పించి మురియుదును అమ్మకు మారుగ అగ్నిలో జొత్తును॥ఆశ॥

పుష్పకమెక్కి హరితో నయోధ్యకు బోదును

భరతుడానంద భరితుడై వేడుకొనగ

జోరున వాద్యములు భువనములు నిండి మ్రోయగ

పట్టాభిషేకము పరమఋషులు సేవింపగ

జలజాక్షులు జయములు పాడంగ రాములతొడపై లక్ష్మియుండగ

లక్ష్మణానుజులు వింజామర విసరగా వాయుసుతుడు పద వనజము లొత్తగా

జేరి విభీషణ మహాత్మయనగా అర్థికపులు హరిగోవిందయనగ

బ్రహ్మాదులు హరి ప్రస్తుతింపగా తల్లిమారుతికి దండవేయగా

నా తల్లియపుడు నాకును వేయునుగద కష్టపడితినని కరుణించుగద

సీతారాములు సిరులిత్తురుగద ॥ఆశ॥

35. వరాళి రూపకతాళం

పల్లవి :ఇదిగో రండి పైకము చూడండి

దినిటీ వేయించండి తివాసులు పరిపించండి

రవాణ ధనములు కన్నుల జూచి

రశీదు మాకు వ్రాసియివ్వండి

పంద్రేండ్లాయెమీరు బందిఖానాలోన నుంచీ

పాపమనక రామదాసుని బాధించుచున్నావు చాలు॥ఇదిగో॥

పారనలేని దొరతనమట పాలించుచుండి

మీరేప్పుడూ చెల్లి చెలకలున్నను ప్రొద్దున చెల్లగట్టి పోయెదముగాని

॥ఇదిగో॥

రామదాసుని తల్లిదండ్రులు రయమున తనయునిగనుగొని

క్షేమమరసిపోవగ వచ్చితి మీక్షణమాలస్యము చేయుటతగదిక ॥ఇదిగో॥

36. కల్యాణి చాపుతాళం

పల్లవి : ఇన్ని గల్గి మీరూరకున్న నే నెవరినాడ నౌదు

కన్నతండ్రివలె రక్షించుటకును కరుణ యేలరాదు

అక్షయ మియ్యదలచిన శ్రీ మహాలక్ష్మీదేవి లేదా

రక్షింప దయగలిగిన భూదేవియు రత్నగర్భగాదా॥ఇదిగో॥

పక్షపాతమొదలి పని చేతిలో పరుసవేది లేదా

ఈ తక్షణమున దయగలిగిన సంచిత ధనమున్నదిగాదా ॥ఇదిగో॥

ననుగని నిర్హేతుక కృపజూచిన కల్పతరువు లేదా

మనవాడని నెనరుంచిన చింతామణి యున్నదిగాదా॥ఇదిగో॥

పెనబడు వెతదీర్పును శరణాగతి బిరుదు నీదేగదా

వనజ భవాండము లేలు దొరలు దేవరవారలెగదా॥ఇదిగో॥

కరిప్రహ్లాద విభీషణాదులను కాచితివని వింటి

హరసుర బ్రహ్మాదుల కంటెను నిను నధికుడవనియంటి ॥ఇదిగో॥

రామసిరిదాయక నీ మరుగుజొచ్చితిని చేపట్టు మటంటి

కరుణతో భద్రాచల రామదాసుని గావుము యనియంటి ॥ఇదిగో॥

37. వరాళి రూపకతాళం

పల్లవి : ఎంతో మహానుభావుడవు నీవు

ఎంతో చక్కని దేవుడవు

వింతను చేసితి వీ లోకమందున

సంతత భద్రాద్రిస్వామి రామచంద్ర ॥ఎంతో॥

తొలివేల్పు జాంబవంతుని చేసినావు

మలివేల్పు పవనజుగా జేసినావు

వెలయ సూర్యు నుగ్రీవుగ జేసినావు

ఇల సర్వామరుల కోతుల జేసినావు ॥ఎంతో॥

కారణ శ్రీ సీతగ జేసినావు

గరిమ శేషుని లక్ష్మణుని జేసినావు

ఆరెంటిని భరతశత్రుఘ్నుల జేసినావు

నారాయణ నీవు నరుడవైనావు ॥ఎంతో॥

రాతికి ప్రాణము రప్పించినావు

నాతి ఎంగిలి కానందించినావు

కోతి మూకలనెల్ల గొలిపించినావు
నీటిపై కొండలు నిల్పించినావు ॥ఎంతో॥
లంకపై దండెత్తి లగ్గెక్కినావు
రావణకుంభకర్ణుల ద్రుంచినావు
పంకజాక్షిని సీత పాలించినావు
లంకేశు దివ్యపుష్క మెక్కినావు ॥ఎంతో॥
పరగ నమోధ్యకు బరతెంచినావు
పట్టాభిషిక్తుడవై పాలించినావు
వర భద్రగిరి యందు వసియించినావు
ధరను రామదాసు దయ నేలినావు ॥ఎంతో॥

38. ఆనందభైరవి చాపుతాళం

పల్లవి :ఎటుబోతివో రామ ఎటుబోతివో
ఎటుబోతివో నిన్ను నే వేడు కొనుచుంటి
గటకటా నేడు నా కనుల జూతామంటె ॥ఎటు॥
అంధకారమువంటి బంధిఖానాలో
నన్ను నిందల నెడబాపనేల నీకు మ్రొక్కెదస్వామీ॥ఎటు॥
పాపము లన్ని యెడబాపెడి దొరవు నీవు
ఆపదలుదీర్చి నన్నాదుకొమ్మంటీ స్వామీ ॥ఎటు॥

తాసీషాగారు వచ్చి సరితీర్పు చేరుదును

పైకము బంపించి వేగ బంధిఖానా వదిలింప ॥ఎటు॥

అపరాధినని చాల మతిచేసి మొరలిడగ

వెనుకటి నేరము లెంచక వేగమె రావే ॥ఎటు॥

అప్పుల వారొచ్చి యరికట్టుచున్నారు

ఒప్పుకోబడునని చెప్పక దాగినావె ॥ఎటు॥

నీవు భద్రాచల నిలయుడవయ్య రామ

బ్రోవవయ్య రామదాసు నేయెడ స్వామీ ॥ఎటు॥

39. వరాళి చాపుతాళం

పల్లవి : ఎన్నెన్ని జన్మము లెత్తవలయునో యేలాగు తాళుదును ఓరామా

నన్నింత కన్నడ జేయుట నీకు న్యాయము కాదు సుమీ ఓ రామా

॥ఎన్నెన్ని॥

మొదటి నిబంధనము సగమాయువు నిదురపాలై పోయెనుగా ఓ రామా

పదపడి తక్కిన సగములో పదియేండ్లు బాలత్వమున బోయెనుగా ఓ

రామా॥ఎన్నెన్ని॥

వదలక యౌవనము పరాభావమువలన దగులనాయెనా ఓ రామా

రాముడిమి సంసారకూపములో జిక్కి మునిగి తేలగనాయేనా ఓ రామా

॥ఎన్నెన్ని॥

తను వస్థిరంబని తారకనామము తలపోయలేనైతిగా ఓ రామా

దినదినము పొట్టకొరకై దీనులవేన దీనత్వమొందితిగా ఓ రామా

॥ఎన్నెన్ని॥

అనుదినమును గురువుపదేశయోగము నభ్యసించనైతిగా

ఎనసి నిమిషమైన మీ పాదములపైన మనసు నిల్పగనైతిగా ఓ రామా

॥ఎన్నెన్ని॥

వాసిగ నిహములో బడిన పాటునెల్ల బాసిన పాశముగా ఓ రామా

మీ సేవజేయు మిమ్మే నమ్మిన భవపాపములంటవుగా ఓ రామా

॥ఎన్నెన్ని॥

లేశమైన కృతజేసి భద్రశైలవాస కావగా రావుగా ఓ రామా

ఆశతోనే రామదాసుడని మీకు దోసిలి యొగ్గితిరా ఓ రామా ॥ఎన్నెన్ని॥

40. బిలహరి ఆదితాళం

పల్లవి : ఎవరు దూషించిన నేమి మరి ఎవరు భూషించిన నేమి

అపగుణము మాన్పి యార్చే రా తీర్చే రా

నవనీతచోరుడు నారాయణుడుండగ ॥ఎవరు॥

పిమ్మట నాడిననేమి మంచి ప్రియములు పలికిన నేమి

కొమ్మరో రమ్మని కోరికలొసగెడి సమ్మతి నాపాలి సర్వేశ్వరుడుండగ

॥ఎవరు॥

వాని పంతము మాకేల వట్టివాదులతోడ పోరేల

భాషించువారితో పలుమారు పొందేల కాచి రక్షించెడి ఘనుడు రాముడు

॥ఎవరు॥

అపరాధముల నెంచువారు మాకు ఉపకారులై యున్నారు

విపరీత చరితలు వినుచు నెల్లపుడు కపటనాటకధారి కనిపెట్టి యుండగ

॥ఎవరు॥

వారి వన్నెలు సల్పనేల మూడు వాసనలకు భ్రమయనేల

వాసిగ భద్రాద్రివాసుడై నిరతము భాసురముగ రామదాసుడై యుండగ

॥ఎవరు॥

41. నాదనామక్రియ ఏకతాళం

పల్లవి : తానీషా : ఏ దేశమున నుండువారు మీరలెందుండి యిట వచ్చినారు

రామ : తొలుత గోదావరియందు మా స్థలమది భద్రాచలమందు

తానీషా : ఎవరి జవానులు మీరు మిమ్మెవరు బంపక వచ్చినారు

రామ :దాసజవానులు మేము రామదాసు పంపగ వచ్చినాము

తానీషా : ఏ కులమువారు మీరు మీరిద్దరు నే వరుసవారు

రామ : ఇనవంశమున బుట్టినాము మేమిద్దర మన్నదమ్ములము

తానీషా : ఏమి నామము గలవారు మీరేమి నియమము గలవారు

రామ : రామోజీ లక్ష్మోజినామం వహ్వా రామానుజ మతమువారం

తానీషా : ఎన్నిదినములనుండి మీరు వారిసన్నిధి కొలువై యున్నారు

రామ : తాతముత్తాతలు మేము మూడుతరములనుండి యున్నాము

తానీషా : ఏమి జీతమిచ్చెదరు మీకు ఏమి జీవనమిచ్చెదరు

రామ : సమ్మతిలేని జీతము ప్రసాదమునకే కుదిరినాము

తానీషా : ఎందుకు పంపించినారు మీరేమి పనిగ వచ్చినారు

రామ : సర్కార్కాకీ పైకము మాచేత బంపగ వచ్చినాము

తానీషా : అర్థమంతయు దెచ్చినారా లేక వ్యర్థముగ వచ్చినారా

రామ : వ్యర్థులముగ మేము రాము మీయర్థమంత దెచ్చినాము

తానీషా : బైరోజి బైరోజి మీ మాటలు చూడగ వేరు

రామ : బైరోజి వారముగాము మీ భేటికి వచ్చినాము

తానీషా : లక్షలారును దెచ్చినారా యింకా శిక్షలో నుండమన్నారా

రామ : లక్షలారునియ్యగలము మూడు లక్షలు మేమియ్యగలము

తానీషా : పంపిన పైకము తెండి యాపయిన తమాషా చూడండి

రామ : పదివేలు తెచ్చినామండి యాపయిన మాచేత లేదండి

తానీషా : మగురూర్మాటలు మీతో మాతో మరలించుచున్నారు

రామ : మగురూరి వారితో మేము మాట్లాడువారము కాము

తానీషా : ధనము మాచేతికియ్యండి యావెనుక ఖైదులోకి పొండి

రామ : ఖైదులోకి మేము పోము మీ ఖజాన పైకమిచ్చేము

తానీషా : చెల్లింతురా ద్రవ్యమంత రసీదు నడుగుట కడువింత

రామ : ఉంగరంబులీడెమందు నుప్పొంగుచు తొడదట్టెయందు

తానీషా : మొహరువేసినంతను మోహనాంగుడు సంతసమునను

42. మధ్యమావతి చాపుతాళం

పల్లవి : ఏదేశము మీది యెవ్వరు బంపిరి యెందుకై వచ్చితిరి

భేదమొందక యతి భీతి నొందక మాకు

ఖ్యాతిగ జెప్పిన గాచేము మిమ్మిపుడు

అజునికైన నలవికాదిచటికి రాగ అర్థరాత్రియందున

గజ సింహములనైన ఖండించు భటులెంతో

కావలియుండగ గడిచివచ్చితి రెట్లు

అర్థమంతయు జూడ నాశ్చర్యమాయేను

అటు భారమెటు దెస్తిరి

భద్రేభములకైన బరువైతోచు నీ యర్థము

మీరెచట నార్జించి తెచ్చితిరి ॥ఏదేశము॥

మీ రూపు మీ సొగసు మీ చక్కదన మెన్నలేరు

~~ఈ~~ ధరయందున

మాయావేషముల గారడి మాయమీరు

నెరవుతో బన్నినారనితోచెను ॥ఏదేశము॥

ఇంత రాత్రివేల నీ యర్థమిప్పుడు

ఎంతని పరికింపను

రంతు సేయక రేపంతయు చెల్లింపుడు

అంతదనుక ఖైదులోనుండు డనెనపుడు ॥ఏదేశము॥

43. ఆనందభైరవి ఆదితాళం

పల్లవి : ఏమిటిది దయరాదు శ్రీరాములు

నన్ను నేమిటికి రక్షింప శ్రీ రాములు

పరులను వేడబోను శ్రీరాములు

నీకే కరములు చాచి యున్నాను శ్రీరాములు

పంద్రెండేండ్లాయె నేమి శ్రీరాములు

బందిఖానాలో నేనుండినాను శ్రీరాములు ॥ఏమిటిది॥

అర్థము తెమ్మనుచునన్ను శ్రీరాములు

ఇప్పుడరికట్టనెంచినారు శ్రీరాములు ॥ఏమిటిది॥

తానీషాగారి జవానులు నన్ను

తహసీలు చేయుచున్నారు శ్రీరాములు ॥ఏమిటిది॥

ముచ్చటైన యాడతేన శ్రీరాములు

నీవు యిచ్చే యర్థము లియ్యనేడు శ్రీరాములు ॥ఏమిటిది॥

నీచేగాకున్న నింకను శ్రీరాములు

మాతల్లి సీతమ్మలేదా శ్రీరాములు ॥ఏమిటిది॥

మాతల్లి సీతమ్మకైన శ్రీరాములు

నేను మనవి చెప్పుకొందునయ్య శ్రీరాములు ॥ఏమిటిది॥

ఆశించియుండిన దాసుని శ్రీరాములు
నీకు పోషి భారము లేదా శ్రీరాములు ॥ఏమిటిది॥
నిన్ను నమ్మినానయ్య శ్రీరాములు
నేను గట్టిగా నా మదిలో శ్రీరాములు ॥ఏమిటిది॥
ఇల్లు వదలిటురావదేమి శ్రీరాములు
మీకు విడిది భద్రాచలమాయెనో శ్రీరాములు ॥ఏమిటిది॥
వాసిగభద్రాద్రి వెలిసిన శ్రీరాములు
రామదాసుని రక్షింపరాదా శ్రీరాములు ॥ఏమిటిది॥

44. నాదనామక్రియ ఆదితాళం

పల్లవి : ఏమిరా రామా నావల్ల నేరమేమిరా రామ
ఏమి రామ యీలాగుకష్టము నీ మహిమో నా ప్రారబ్ధమో ॥ఏమిరా॥
కుండలి శయనా వేదండరక్ష కాఖండతేజ నాయండ నుండవే
పంకజలోచన శంకరసుత సంకటములు మాన్పవే పొంకముతోను
॥ఏమిరా॥
సుందరధర నీ సుందర పదములు ఇందిరేశ కనుగొందుచూపవే
॥ఏమిరా॥
దినమొక యేడుగ ఘనమున గడిపెద తనయుని మీదను
దయలేదయ్యయ్యో
॥ఏమిరా॥

సదయాహృదయ నీ మృదుపదములు నా హృదయ కమలమున వదలక నిల్పెద

॥ఏమిరా॥

రామరామ భద్రాచలసీతారామదాసుని ప్రేమతో నేలవే॥ఏమిరా॥

45. బేగడ ఏకతాళం

పల్లవి : ఎలాగు తాళుదు నేమి సేతు రామా

ఈ జాలిచేతను తాళజాలను రామా

దీనజనుల కెల్ల దిక్కు నీవే రామా

మనమున నిన్ను నేమరవనో రామా ॥ఏలాగు॥

పావనమూర్తి యో పట్టాభి రామా

కావవే యీవేళ కౌశల్య రామా ॥ఏలాగు॥

శరణుని నీ మరుగు జేరితి రామా

శరణంటే కాచేది బిరుదు రఘురామా ॥ఏలాగు॥

చెప్పరాని ప్రేమ నెంచు దాతుర రామా

ఆపన్న రక్షకుడ నాపాలి శ్రీరామా ॥ఏలాగు॥

నీ సొమ్మునే నటుల నిజమాయె రామా

నా దోషములనన్ని దొలగింపవె రామా ॥ఏలాగు॥

రాతికైన చెమట రంజిల్లునో రామా

ఆతీరు నీ మనసు నొందుదు శ్రీరామా ॥ఏలాగు॥

యమబాధ నొందగ నేరనో రామా

యమదండనలు లేక యెడబాపు రామా ॥ఏలాగు॥

వాసిగ రామకీర్తనలు జేసితి రామా

రామదాసునిమీద దయయుంచు శ్రీరామా ॥ఏలాగు॥

46. మధ్యమావతి ఆదితాళం

పల్లవి : ఓరఘు నీవాయని నే బిలిచిన

నోహో యనరాదా

సారెకు మరి వేసారి యన్యము

చేరదు నామది యేరా ధీరా

నీటజిక్కి కరి మాటికి వేసరి

నాకట ధర నీపాటల బాడగ

మేటి మకరి తలమీటి కాదు దయ

ఏనాటికి నాపై నేటికి రాదో ॥ఓరగు॥

మున్ను సభను నా పన్నత వేడుచు

మిమ్ము కృష్ణాయని యెన్నగ ద్రౌపది

కెన్నో వలువలిచ్చి మన్నన బ్రోచిన

వెన్నుడ నా మొర వింటివో లేదో ॥ఓరగు॥

బంటునైతినని యుంటె పరాకున
నుంటిని తెలిసి ముక్కంటి వినుత నా
జంట బాయకను వెంట రమ్మని వేడు
కొంటి భద్రగిరి రామదాస పోషక ॥ఓరగు॥

47. శంకరాభరణము రూపకతాళం

పల్లవి : కంటినేడు మా రాముల కనుగొంటి నేడు
కంటి నేడు భక్తగుణముల మాపాలి
మా జంటభద్రగిరి నంటియున్నవాని ॥కంటినేడు॥
చెలువొప్పుచున్నట్టి సీతాసమేతుడై
కొలువు తీరిన మా కోదండరామ ॥కంటినేడు॥
కమలాప్త తిలకము ఘన నీల గాత్రము
కరుణారసము గురియు కందోయి గలవాని ॥కంటినేడు॥
హుంకుమంజి ముత్యాలసరములు మెరయగ
మురిపెంపు చిరునవ్వు మోము గలిగినవాని ॥కంటినేడు॥
ఘల్లుఘల్లుమని పైడి గజ్జెలందెలు మ్రోయు
తళుకు బెళుకు పాదతలము గలిగినవాని ॥కంటినేడు॥
కరకు బంగారుచేల కాంతిజగము గప్పు
శరచాపములు కేల ధరియించు స్వామి ॥కంటినేడు॥

ధరణి శ్రీరామదాసుని రక్షించు
పరమపురుషుడైన భద్రగిరీశుని॥కంటినేడు॥

48. కాంభోజి ఏకతాళం

పల్లవి : కటకట నీదు సంకల్పమెట్టిదో గాని
నేనెంతవాడనురా రామా
నిటలాక్షుడు తొల్లి నీ మాయ గనలేక
తటుకుపడి నీవల దగిలెను గనుక ॥కటకట॥
శరణన్న మునులను బిరబిర బ్రోచెడు
బిరుదుగల్గిన దొరవే ఓ రామా
పరిపరి విధముల మొరలిడ వినక
నన్నరమర చేసిన హరి నిన్నే మందు ॥కటకట॥
భావ జనక నా భావ మెరుగవే
వేగమున రాగదే దేవా
దేవాదిదేవా దీనశరణ్యా
నీవే దిక్కని నిక్కము నమ్మితి ॥కటకట॥
గీర్వాణసుత భద్రగిరివాసా
సర్వయోగీశ్వర రామా
సర్వాత్మ రామదాస హృదయాబ్జ నిలయా

సర్వాధారా పరాకేల రామా ॥కటకట॥

49. సౌరాష్ట్ర ఆదితాళం

పల్లవి : కరుణించి దైవలరామ అహో

పరమపావననామ పట్టాభిరామా ॥కరుణించి॥

అన్న వస్త్రము లిత్తుమనుచు దొరలన్నారు మన్నించెదవనుచు

ఆయురన్నం ప్రయచ్ఛతి యనుచు మారకున్నను నీవే మాకున్నావనుచు

॥కరుణించి॥

మరియింత కాలమ్ముదనుకా మమ్ము మరచితివని ఒప్పుకొనర

మమ్ము దరిజేర్చినంతదనుకా మీది శరణాగత త్రాణ బిరుదటు కనుక

॥కరుణించి॥

నరులను గొలచుటకన్నా భద్రగిరిరాఘువుని వేడుకొన్నా

ఇహపరము లిలగలవని విన్నా నేను దరహాసము నా రామదాస ప్రసన్నా

॥కరుణించి॥

50. కన్నడ ఆదితాళం

పల్లవి : కలనిజమాయె కలికిరో వినవే

కలనిజమాయెనే ॥కల॥

చూపున బాలారే సొగసైన రౌతులే

రేపనరాదే యో రమామణి నమ్మలేదు ॥కల॥

నా మదిలో నిను నరులని గాన లే

నీ మహిలో నేనెరుగనివారే ॥కల॥

పురుషులు చూడగ పురాణపురుషులే

మర్యాదలేదే మహానుభావులే ॥కల॥

దాస జవానులే జాతి కబీరులే

వాసవిసుతులే వారిజనేత్రులే ॥కల॥

భద్రాద్రి వాసులే భవ్య యశోద్భృష్ణాలే

భద్రాద్రి రామదాసపాలిట చిద్విరాసులే ॥కల॥

51. సావేరి చాపుతాళం

పల్లవి : కలయే గోపాలం కస్తూరి తిలక సుఫాలం

కుండల రుచిరం లలితకపోలం

చంద్రసన్నిభ కాంతి కాంతం

జగన్నాధపురీ నిశాంతం ॥కలయే॥

అనుపమ రూపం మహితమణి కనిక కలాపం

విగతగోప వినుతాడు తాపం

ముని మనోసీరేజ తరణీం

పంకజ సన్నిభ చారుచరణం

విదిత ద్విజకాంత కరాంభోజ నవనీతం

కమల భవముని గీతం

వివిధ కుసుమాలంకారం

విమల బృందావన విహారం ॥కలయే॥

భాసిత భాసురం భద్రాద్రినివాస నిధానం

దివ్యానంత భూసురగానం

రాజకేళి విరాజమానం

రామదాస స్తుతి నిధానం ॥కలయే॥

52. మోహన ఆదితాళం

పల్లవి : కలికి యీ కల సాంగముగ వినవే

ఓ కలికి పలుకగ నీతో మైపులకలొాద వేడిని

అప్పుకలుగువాడె యువతి రామదాసుడు

అప్పుడతనికై నేడు

ఇద్దరు గూడి జోడుకప్పము పుచ్చికొనెడి

చెప్పున మము బంపుడు

తప్పక యెసగుడు తడవులేక రసీదనుడు ॥కలికి॥

రామలక్ష్మణులట వా రర్కవంశజులట

రామదాసు పైకమట రసీదు బంపెనట

రాములవారు చెల్లించిరట రోసీదందిపోయిందట
ఏమి కారణము యెరుగను ఈ కలను
యేమని చెప్పుదునే సెలనాగ యీ వింత
ఈ మహిమలు  ఆ రాములది కాబోలు
జాము ప్రొద్దున్నది జయ మపజయమొ యెరుగ॥కలికి॥

53. ఆనందభైరవి                    రూపకతాళం

కలియుగ  వైకుంఠము భద్రాచలనిలయము సేవింతము
అలివేణులారా మీరానందముగ వేగ విలిసితమైనట్టి వేడుక చూడరె
॥కలియుగ॥
కాంచనసౌధములు కంబమును మించిన దూలములు
వజ్రములు చెక్కించిన స్తంభములు
పగడములని భ్రమించు ద్వారములు
అంచయాన మరి యెంచలేనుగాదె
మంచి పచ్చలు గూర్చిన వాకిళ్ళు                    ॥కలియుగ॥
బంగారు గోపురములు దేవళముల వెలుంగు మాణిక్యములు
భేరిమృదంగాది నాదములు భాగవతుల సంకీర్తనలు
సొంపైన కల్యాణరత్న మంటపములు
శృంగారమేమని దెలియ విన్నవింతు                ॥కలియుగ॥

తీరైన పురవీధులు సొంపైన కోనేరులు
సోపానములు సకల ఫలతరువులు
ఆ నదులు ఋషి గంధర్వ నివాసములు
సరసిజాక్ష వినవే సరిలేని గోదావరి స్నానములు
సంపత్కరమై యొప్పినది ॥కలియుగ॥
చక్కని స్త్రీ పురుషులు పట్టణమందు
పిక్కటిల్లగ వింతలు బ్రాహ్మణులు మక్కువతో పూజలు
వేదశాస్త్రతార్కిక వైష్ణవులు గ్రక్కున వారిని కన్నులజూచి
తక్కువైన పుణ్యమేయని తెల్పుదు ॥కలియుగ॥
వామాక్షులాడగను సీతనుగూడి
హేమపీఠమునందు సంపూర్ణకళలు మోము వెలుగగను
పరివారములు ప్రేమతో గొలువగను
ప్రేమచే భద్రాద్రిరామదాసుని మేలు
స్వామి శ్రీ కోదండరాము నివాసము ॥కలియుగ॥

54. కళ్యాణి ఆదితాళం

పల్లవి : కైంకర్యము చేసెను రామదాసు కైంకర్యము చేసెను
కైంకర్యముచేసె కాకుత్థ్స తిలకునకు
సంకటహరణ సర్వాత్మయని మ్రొక్కి ॥కైంకర్యము॥

శ్రీ కరమగు రాజిత మణిశాలల

ప్రాకారంబుల బహుమతమెల్లెడ

మంజుల తరమగు మణి మంటపములు

రంజరాగమణి కలితాంగంబుల ॥కైంకర్యము॥

చౌకంబుగ కాంచన కూటంబుల

నాకాశంబున కంటెడు తేరుల

గోపుర మెరసెడి నోపురవితతుల

దీపించు వితర్థిశల బెడంగుల ॥కైంకర్యము॥

తళుకుగులుకు పగడంపు కంబముల

బలుపడంబులును బలు కలువడముల

రంగుగ ముత్యపు రంగవల్లికల

శృంగారములగు చిరతపాలికల ॥కైంకర్యము॥

మకరతోరణ మణి మాల్యంబుల

ముకురతోరణ సమ్మోదంబుల

భుగభుగ వెలసెడు పూ చప్పరముల

అగరు ధూపముల నాలపట్టముల ॥కైంకర్యము॥

మెరసెడు రీతిని మేలిమిగాగను

ధారాళములగు ద్వారబంధముల

చారురత్న కాంచన శిఖరంబులకు

ఘుమఘుమమనియెడు గంధవాసనల ॥కైంకర్యము॥
ఘుమఘుమ యను బలు కుంకుమరసముల
ఘణఘణఘణ యను గంటల తలుపుల
ధణధణ యనెడి మృదంగ వాద్యముల
మిసమిస మెరిసెడి మేనిమిగోడల ॥కైంకర్యము॥
కనకమయంబగు గరుడ ధ్వజముల
రామరామయను రామ శుకంబుల
వేమరు పొగడెడు విబుధ గణంబుల
పొసగ మ్రోయు తంబురుల పరంబుల ॥కైంకర్యము॥
కొసరి యాడు భక్తుల నృత్యంబుల
వైనతేయముఖ వాహన చయముల
పూనినమర్దల భూరి నినాదము
మెరసెడిరీతిని మేలిమిగాగను ॥కైంకర్యము॥
వెల్లగొడుగులను వింజామరములు
మల్లెల మొల్లల మంచివాసనల
పిల్లనగ్రోవి గంభీర స్వరముల
ఝుల్లరి ఢక్కా జయనాదమ్ముల ॥కైంకర్యము॥
పల్లవపాణులు పాటలాటల
సల్లలితోత్పలచయ పరిమళముల

వనమాలా సంతత సౌరభముల

ఘన తులసీదళ ఘన కదంబముల ॥కైంకర్యము॥

రామభజన సంభారోత్కరముల

రామతీర్థ సారసముల తావుల

రామస్మరణావ మధురమ్ముల

రామభద్ర విగ్రహదర్శనముల ॥కైంకర్యము॥

హనుమదంగ వాహనముల ఘనముల

అనుపమ శృంగారానందముల

రమణ భద్రగిరి రామాలయములు

అమలానందంబై ధరలోపల

మెరసెడిరీతిని మేలిమి గాగను ॥కైంకర్యము॥

55. నాదనామక్రియ రూపకతాళం

పల్లవి : ధన్యుడవు తానీషా నీవు

నన్ను గన్నయ్య పదములు కలగన్నావు ॥ధన్యుడవు॥

నిన్నటిరాతిరి వారు వచ్చియున్న ముచ్చటలాడి యేమేమి యున్నారు

ఎంతవేడినగాని రారు నీవు పుణ్యమూర్తివి గనుక పొడసూపినారు

తానీషా : ధన్యుడవు గోపన్న నీవు యా దాశరథికి నిజదాసుడైనావు

సామాన్యుడని యెంచుకొంటి శ్రీరామచంద్రుల సేవ మీవలన గంటి

ప్రేమతో సేవించుకొంటి నేను పామరుడనై మిమ్ము బాధింపుచుంటి॥ధన్యుడవు॥
గోపన్న : ఏమి పూజలు చేసినారు మా స్వామి భద్రగిరి దాసులు మీరు
ప్రేమతో సేవించినారు శ్రీరామ కృపగల్గి రంజిల్లుతారు
తానీషా : పైకము దీసుకుపొండి భద్రాచల రామదాసులై పట్టమేలండి
అయినదెల్ల వేడుకొనండి మీరు అనుదినము రాముల నర్చించండి ॥ధన్యుడవు॥
గోపన్న : ఏటిమాటలు పలికెదరు నా కేటికి రాజ్యమీ యిలలోనే మీరు
మేటి జన్మమెత్తినారు మీ సాటివారలు యీ జగములోలేరు॥ధన్యుడవు॥
తానీషా : భద్రాచలము నెప్పటికి మీ రామభద్రున కిచ్చితి బాగుగా వినుమా
ముద్ర నిశానీల్ కొనుమా శ్రీ భద్రాద్రివర రామదాసుడై యేలుమి ॥ధన్యుడవు॥

56. మాయామాళవగౌళ ఏకతాళం

పల్లవి : నందబాలం భజరే నందబాలం
బృందావన వాసుదేవా బృందాలోలం ॥నంద॥
జలజ సంభవాది వినుత చరణారవిందం
లలితమోహన రాధావదన నళిన మిళిందం ॥నంద॥
నిటల లలిత స్ఫటికుటిల నీలాలక బృందం కృష్ణం
ఘటిత శోభిత గోపికా ధర మకరందం ॥నంద॥
గోదావరీ తీర రాజగోపికా రామం కృష్ణం
ఆదిత్యవంశాబ్ధి సోమం భద్రాద్రి రామం ॥నంద॥

57. నాదనామక్రియ ఆదితాళం

పల్లవి : పొయ్యేటప్పుడు వెంటరాదుగా పుచ్చినవక్కయినా

వెయ్యారులు దాచుకొనియు నర్థులకియ్యని లోభుల కయ్యయ్యో

॥పొయ్యే॥

చరణములు :

ఇచ్చిన మాత్రం బిచ్చును దైవము హెచ్చడిగినరాదు

వచ్చేటప్పుడు వెంటనేమైన తెచ్చుకొన్నదిలేదు ॥పొయ్యే॥

హెచ్చుగతిది తెలియని పామరులు దురాశను తగులుకొని

ఇచ్చుటనార్జించిన ధనమెచ్చటకెత్తుకు పొయ్యే దరయ్యయ్యో ॥పొయ్యే॥

తనువును రక్షించుటకై మూలమూలలందును ధనము దాచెదరు

తనువును సుతబాంధవు లస్థిరమని తలచి గానగలేరు॥పొయ్యే॥

58. కాంభోజి ఆదితాళం

పల్లవి : బహుకాలమునకు శ్రీ భద్రాచలశేషునకు పాదసేవకుడనైతి

అహహా నాజన్మము సఫలమాయె నేటికిని అనుమానములు దీరె నిక సుంతగను

॥బహు॥

తల్లి గర్భమునందు మలమూత్రముల మునిగి ధరణిపై జన్మించితి

కల్లలాడుచు పాపకర్మలొడిగట్టి కామపురుషులను జేరితి నీవేగతి

॥బహు॥

కోపుడను పాపుడను గుణహీనుడను నేను క్రూరుడను కుత్సితుడను

దాపుచేయక నన్ను రక్షింపదలచు శ్రీరామచంద్రునకు భారమా యికను

॥బహు॥

అఖిల లోకంబులకు నాధారమ్మైయున్న యాది పురుషోత్తముడు

సత్క్రియతో గూడిన సమయమందుజేరి సన్నుతులు చేయకలిగి తొలుత

॥బహు॥

రామదాసుని నేలుకొరకై శ్రీభద్రాద్రిధాములై యుదయించి

యేమికొదవలు మనకు నెరుగగలుగజేసే స్నేహంబునితరమెల్లకల్ల

॥బహు॥

59. మధ్యమావతి చాపుతాళం

పల్లవి : బిడియ మేలనిక మోక్షమిచ్చి నీవడుదుదాటిపోరా

తడవాయెను నేనోర్వలేను దొరతనము దాచుకోరా॥బిడియ॥

మురియుచు నీ ధరజెప్పినట్లు విన ముచికుందుడగాను

అరుదుమీరలని నెగురవేయ నే హనుమంతుడనుగాను

సరగున బ్రముచ్చులమాటలు విన నే జాంబవంతుడను గాను

బిరబిర మీవల లోపల బడ నే విభీషణుడనుగాను॥బిడియ॥

మాయచేత వంచింపబడగనే మహేశుడనుగాను

న్యాయములేకయే యిటునటు దిరుగను  నారదుండగాను

ఆయయముచెడి హరినరుడని కొలువను నర్జునుండగాను

దాయాదుండని మదిలో మురియను దశరథుడనుగాను ॥బిడియ॥

గరిమతోడ మా సీతనుజూడ కాచితినిందాక

పరగభద్రుని శిఖరావాసా పరబలసంహార

నరహరి నను రక్షింపువేగమే నారాయణరూపా

మంచి నిదురలోనైనను మీపద సరసిజములు మరువ॥బిడియ॥

60. మోహన ఆదితాళం

పల్లవి : భద్రాద్రిపురమున మేము బహుదినముల నుండి కాపురము

అద్రిజాధిప బ్రహ్మేంద్రాదులకెల్ల భద్రములొసగెడు భవ్యవిధానము

॥భద్రాద్రి॥

ఇనవంశజులు మేమిద్దరము చాలదినమునుండి యున్నారము

అనిశము రామదాసుని యాజ్ఞ చొప్పున పనులు చేయుచు ॥భద్రాద్రి॥

ఖైదు చేసిన వార్తదెలిసి యిల్లు బయలుదేరి మిమ్ములకలసి

పైకము చెల్లించి భక్తుని యాపదబాపి గొంపోయెడి పనికైవచ్చితిమి

॥భద్రాద్రి॥

భక్తుడైన రామదాసు యెంతో శక్తిచేసిరి మంచి మేలని

ముక్తిని ధానమౌ యుక్తి తెలియక యాశక్తి ధనాపేక్షకై యిటు చేసిరి

॥భద్రాద్రి॥

మించిన కార్యమేమాయె యెంతో వంచన చేయుటలాయె

సంచులన్నీ మీరె యెంచి రసీదు వ్రాయించి సెలవిప్పించండి వేగమె

॥భద్రాద్రి॥

రామదాసుని రప్పించు తండ్రి ప్రేమతో మాకప్పగించు

స్వామి యా భద్రాద్రి సదయుని కనుగొన రామదాసునిగూడి

రయమునబోవలె ॥భద్రాద్రి॥

61. నాదనామక్రియ రూపకతాళం

పల్లవి : ముచ్చటైన వాడవేమిరా కోదండపాణి

ముచ్చటైన వాడవేమిరా ॥ముచ్చటైన॥

ముచ్చటైన వాడవేమి ముదముతో మీ పాదములు

మరువక నెల్లప్పుడు నామదిని విడువక దలచెదను నేను ॥ముచ్చటైన॥

ఎందాకనే వేడుకొందు ఏమి చేయుదు నీ వేళయందు

చెంతకు చేరితి నన్ను జేపట్టుమిక మ్రొక్కెదను ॥ముచ్చటైన॥

పండ్రెండేండ్లాయెను నేను బంధిఖానాలో నుండి

నల్లుల దోమలచేత నలుగుచున్నది దేహము ॥ముచ్చటైన॥

చైత్రవైశాఖములిపుడు చెప్పతరముగాదు ఎంతో

తహసీలు చేయగ నాకు జామీనైనా యెవ్వరులేరు॥ముచ్చటైన॥

తానీషాగారు వచ్చి తహసీలు చేసెదరు

కాసులుపంపించి నన్ను కరుణతో చెరవిడిపించు॥ముచ్చటైన॥

నేనొక్కడను మీకు సుంతనాపై నెనరులేక

మా తల్లి సీతమ్మకైన మనవిచెప్పగ నెటుబోతివో ॥ముచ్చటైన॥

ఒంటరిగ నన్ను నింటి దగ్గర ఎవ్వరు

జంటతో సీతాలక్ష్మణులు వెంటనే కూడివచ్చి ॥ముచ్చటైన॥

వేమారు శ్రీభద్రాచల రామస్వామి

మీరిప్పుడు రామదాసుని చేపట్టి రక్షింపకున్న ॥ముచ్చటైన॥

62. ఆనందభైరవి రూపకతాళం

పల్లవి : మేలైన చిటికెనవ్రేలు ప్రాతఃకాలమందున గుట్టె తేలు

బాలత్వమున నేను బావి నీళ్ళకు పోయి

కాలుబెట్టగ చిన్నతేలు పొడిచెనయ్య ॥మేలైన॥

చలివచ్చెనని నొప్పిచేత దీని వేడిమి పాపిష్టిఘాత

యీలాగునైన నేనేలాగు తాళుదు

మూలమైన గురుమూర్తి పాదములాన ॥మేలైన॥

మిక్కిలి నలుపుచున్నది రాముగ్రక్కున నాదరించినది

వెక్కసపెట్టుచు కడతేరనీయదు

మ్రొక్కెద నాస్వామి యోర్వగజాలను ॥మేలైన॥

దరిజూపరా స్వామి కేశవా యిట్లు నరులు చేసినరీతి చేసెదవా

పుడమిలోపల భద్రగిరిరామదాసుని బడనీక కాపాడు తండ్రివి నీవే

॥మేలైన॥

63. పున్నాగవరాళి ఏకతాళం

పల్లవి : రక్షించు దీనుని రామ రామ నీ రమణి తోడు నన్ను

రక్షింపకున్నను మీ తండ్రి దశరథరాజుతోడు ॥రక్షించు॥

అరుదుమీరగ విభీషణుని బ్రోచితి వల్ల నాడు అట్లు

కరుణింపకున్న మీతల్లి కౌసల్యదేవితోడు ॥రక్షించు॥

గిరికొన్న ప్రేమ సుగ్రీవుని బ్రోచితివల్లనాడు అట్లు

సిరులియ్యకున్న మీ కులగురువు వసిష్ఠుని తోడు॥రక్షించు॥

అలికుల వేణి యహల్య శాపము బాపితివల్లనాడు అట్లు

కలుషములన్నియు బాపకున్న లక్ష్మణునితోడు ॥రక్షించు॥

పాపాత్ముడైన యక్రూరుని బ్రోచితివల్లనాడు అట్లు

నెపములెంచక కృపజూడకున్న మీయింటితోడు॥రక్షించు॥

వదలక నీ మీదనే నాసలు పెట్టవలసె నేడు

భద్రాచలరామదాసుని యేలకున్న నీ పాదములతోడు॥రక్షించు॥

64. బిళహరి ఆదితాళము

పల్లవి : రక్షించే దొరవని నమ్మితి నిన్ను

రక్షింప తప్పేమి చేసితి ॥రక్షించే॥

రక్షింప మీకంటె రక్షకులెవరు

దాక్షిణ్యమింతైన తలపుల నుంచవు ॥రక్షించే॥

నీ ప్రాపు నెఱనమ్మియుంటిని నన్ను

కాపాడు బిరుదు నీతంటినీ

చేపట్టి విడనాడజెల్లదు యిక నాకు

దాపుననుండియు మీరె దైవము సాక్షిగ ॥రక్షించే॥

ఎంతో వేడిన యేలపల్కవు నే

నెంతద్రోహినో దయజూడవు

ఎంతేసి వారల నేలేటి కర్తవు

అంతకంతకు నాపై యరమరచేసేవు ॥రక్షించే॥

భద్రాద్రివాస నీ బంటును ఇతర

పాపములేదు నావెంటను

అద్రిజ సన్నుత యమరాది వందిత

భద్రేభవరద నాపాలిటి దైవము ॥రక్షించే॥

65. శంకరాభరణ ఆదితాళము

రక్షింపుముదేవా రాచకార్యముపుట్టె రామచంద్ర

నన్ను రక్షింపకున్నను రక్షకులెళీ వరింక రామచంద్ర॥రక్షింపుము॥

అప్పులవారితో అరికట్టుకొన్నారు రామచంద్ర స్వామీ

చెప్పశక్యముకాదు చక్షుర్గోచరమాయె రామచంద్ర॥రక్షింపుము॥

కుక్షిలో మీమీద కోరిక పుట్టెను రామచంద్రస్వామీ

ఇక్ష్వాకు కులతిలక ఇకనైన గానవే రామచంద్ర ॥రక్షింపుము॥

పక్షి వాహన నన్ను పాలింపదయజూడు రామచంద్రస్వామీ

అక్షయకటాక్ష మభిమానముంచవే రామచంద్ర ॥రక్షింపుము॥

అధికుని చేపట్టి అడ్డమేమనుకొంటి రామచంద్రస్వామీ

అధములకన్నను అన్యాయమైపోతి రామచంద్ర॥రక్షింపుము॥

భయమేమి నే రామదాసుడ ననుకొంటి రామచంద్రస్వామీ

భయముబాపి బ్రోవు భద్రాద్రిపురినిలయ రామచంద్ర॥రక్షింపుము॥

66. సౌరాష్ట్ర చాపుతాళము

పల్లవి : రామచంద్ర నన్నేల రక్షింపవో నేనేమెరుగ

నీ చిత్తము నా భాగ్యము నిన్నే నెరనమ్మితి ॥రామ॥

భరతునివలె పాదుకలు పూజింపనేర

కోరి లక్ష్మణునివలె కొల్వనేర

ఓర్పుతో గుహుని నోడ నడుపనేర ॥రామ॥

అంగదునివలె నేను ఆడవము బట్టనేర

సంగరమున సుగ్రీవునివలె సాధింపనేర

గాలిపక్షివలెనేను తాలిమిగమోయ నేర

బలిమితో హనుమంతునివలె పాటుపడనేర ॥రామ॥

లీలతో శబరివలె లాలించి విందిడ నేర

మేలిమిగ సీతవలె మెప్పిరంపనేర

గజరాజువలె నేను గట్టిగా మొరపెట్టనేర

విజయుని సతివలె వినుతింపనేర

గురిగ జాంబవంతునివలె కోరిభజింపగ నేర ॥రామ॥

చేరి విభీషణునివలె శరణననేర

వరజటాయువలె ప్రాణములియ్యనేర

కరము నహల్యవలె గీర్తింపనేర

నేను రామదాసులవలె పూని మిము భజియింపనేర

నన్ను రక్షింపు భద్రాచల రామధీర ॥రామ॥

67. పున్నాగవరాళి ఆదితాళము

పల్లము : రామప్రభో నీదయ నామీదను రాదేమయా శ్రీరామ

పామరుడను జడుడను తామసుడను

నేను వర్జితంబగు నరపశువును నీ మహత్మ్య మెన్న నెంతటి వాడను

॥రామ॥

రామ రామ యనిదలతు నిరంజన రామ

పరుల వేడనంటి నీ పదయుగ్మములే నమ్మి యుంటిని

నన్నరమర చేయవద్దంటిని శ్రీహరియని వేడుకొంటి॥రామ॥

మొరలిడినంతనే కరివరు నేలిన దొరవని నమ్మితిని

నిరసించతగదు మందర గిరిధర

త్రిభువనసుందర యిందిరాసుందరీ మనోహర॥రామ॥

ఏలనాపై గోపము మున్నేమి చేసితినో పాపము

నీలవర్ణ నీరూపము నిరతము కన్నుల జూపుము

మేలొనరించెడి శ్రీలోలుడవని చాల నమ్మియుంటి॥రామ॥

అఘములను బాపర నేను జేసెదను నీ సేవను

ఆశించిన శ్రీరామదాసు నిటుమోసము చేసిన దోసంబెవరిదో

వాసవార్చితాంఘ్రిజలజయుగళ కైలాసవాసనుత భద్రగిరి హరి ॥రామ॥

68. ముఖారి ఆదితాళము

పల్లవి: రామరామ నీవేగతిగద సంరక్షణంబు చేయు

ఏమనందు హా దైవమా నీ మనసింక కరుగదాయె॥రామ॥

పుడమిలోన నావంటి దురాత్ముడు పుట్టడింక నంటి

విడువబోకుమయ్యా యని మున్నే విన్నవించుకొంటి॥రామ॥

ఎన్ని విధంబుల పిలిచిన పలుకవు ఏమదృష్టమందు

ఎన్నరాని పైవన్నెతు వేదనకెటు తాళుకొందు ॥రామ॥

న్యాయమటయ్యా మ్రొక్కినా మొరనాలకించబోవు

శ్రీయుతముగ నిను నమ్మిన దాసు కోర్కెలొసగరావు॥రామ॥

స్వామి నేను నీవాడను నాయెడ చలము చేయకుమయ్యా

ప్రేమమీర నినుగని గొనియాడెద మోముజూపవయ్యా॥రామ॥

నేను గొప్పగ భద్రాచలమందిర నిను నమ్మలేదా

ప్రేమజూచి బంటును శ్రీరామదాసు నేలరాదా ॥రామ॥